క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక


జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన నాయకులు

జంగారెడ్డిగూడెం: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ ఏలూరు జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు చింతా అనిల్‌కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనిల్ బావమరిది సుభాష్ వివాహ శుభలేఖను పార్టీ అధినేత జగన్‌కు అందజేసి వేడుకకు ఆహ్వానించారు. అనిల్‌తో పాటు వరుడు తండ్రి, తాడువాయి సొసైటీ మాజీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ, పెళ్లి కుమారుడు సుభాష్, వధువు తండ్రి నూతి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అయ్యప్పకు పూజలు


హరిహరసుత అయ్యప్పస్వామి వారు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో బుధవారం సందర్భంగా స్వామి వారికి పంచామృత అభిషేకాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సరస్వతీ నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతీ నది పుష్కరాలకు జంగారెడ్డిగూడెం డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్ నడుపుతున్నట్టు మేనేజర్ గంగాధర్ తెలిపారు. ఈ సర్వీసు ఈ నెల 21న జంగారెడ్డిగూడెం నుంచి బయలుదేరి వరంగల్ భద్రకాళీ మాత, వేములవాడ రాజరాజేశ్వరి మాత, కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయాలు, కాళేశ్వరం పుష్కర స్నానం, మహా కాళేశ్వర ఆలయం, అనంతరం రామప్ప ఆలయాన్ని దర్శించుకుని, ఈనెల 23 రాత్రి 8 గంటలకు జంగారెడ్డిగూడెం చేరుతుందని వివరించారు. టికెట్ ధర రూ.2,200గా నిర్ణయించామని, 35 మంది ప్రయాణికులు ఉంటే వారు కోరిన తేదీల్లో ప్రత్యేకంగా బస్ పెడతామని డీఎం తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవికిరణ్

జంగారెడ్డిగూడెం: వేసవి దాహార్తిని తీర్చేందుకు ఐసీఏఐ ఏర్పాటుచేసిన చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ వెస్ట్ గోదావరి పాస్ట్ చైర్మన్, చార్టెడ్ అకౌంటెంట్ వందనపు రవికిరణ్ కోరారు. స్థానిక ఐసీఏఐ వెస్ట్ గోదావరి ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ చలివేంద్రం ద్వారా మజ్జిగ, పండ్ల రసాలు, చల్లని తాగునీరు పంపిణీ చేస్తామని రవికిరణ్ తెలిపారు. సికాస చైర్మన్ సీఏ జి.రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

బాలరాజు పరామర్శ

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాశీ రాము బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పార్టీ కార్యక్రమాల్లో ఆయన విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సారా కేసులో నిందితుడి అరెస్ట్

కొయ్యలగూడెం: మండలంలోని అచ్యుతాపురం గ్రామం శ్రీరంగపట్నానికి చెందిన చమటబోయిన సత్యనారాయణను 10 లీటర్ల సారాతో పట్టుకున్నామని ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం బుధవారం తెలిపారు. ఇతనికి సారా సరఫరా చేసిన పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేటకు చెందిన ఇళ్ల సాయికుమార్ పైనా కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

ఏలూరు (టూటౌన్): చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష, రూ.4 లక్షల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే మహ్మద్ అబుతాలీబ్ ఫర్వేజ్ బుధవారం తీర్పు నిచ్చారు. ఏలూరు నగరానికి చెందిన ఎన్ రమేష్ బాబు వద్ద దేవదాయ శాఖ ఉద్యోగి శ్రీమత్ తిరుమల పెద్దింటి మాదవి తన కుటుంబ అవసరాల నిమిత్తం ప్రోనోట్ ద్వారా రూ.3 లక్షలు అప్పుగా తీసుకుంది. తిరిగి చెల్లింపులో భాగంగా రమేష్ బాబుకు పార్టు పేమెంట్‌గా రూ.2 లక్షలకు చెక్కు ఇవ్వగా అది బౌన్స్ అయ్యింది. దీనిపై ఎన్ రమేష్ బాబు కోర్టులో తిరుమల మాదవి ఉద్దేశం పూర్వకంగానే చెల్లని చెక్కు ఇచ్చినదని కోర్టులో కేసు వేయడంతో చెక్ బౌన్స్ కేసులో నేరం రుజువు కావడంతో శిక్షను ఖరారు చేశారు. తిరుమల మాధవికి ఏడాది జైలు, రమేష్ బాబుకు రూ.4 లక్షలు పరిహారంగా చెల్లించమని తీర్పు చెప్పారు.

మట్టి తోలకాలకు అనుమతులు

ఇరిగేషన్ కార్యాలయానికి క్యూ కడుతున్న నాయకులు


కొయ్యలగూడెంలోని పీడబ్ల్యూడీ కార్యాలయం


శ్రీరామ కట్టు చెరువులో ముందుగానే అక్రమంగా మట్టి తవ్విన దృశ్యం

కొయ్యలగూడెం: సాగునీటి చెరువుల్లో మట్టి తోలకాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని పీడబ్ల్యూడీ డీఈ భాస్కర్ బుధవారం తెలిపారు. క్యూబిక్ మీటర్‌కు రూపాయి చొప్పున రైతులు కట్టాల్సి ఉంటుందని, మట్టిని వ్యవసాయ భూముల అభివృద్ధికి మాత్రమే వినియోగించాల్సి ఉంటుందని చెప్పారు. ఇతరత్రా మట్టి తోలకాలు పక్కదారి పడితే చర్యలు తీసుకోవడంతో పాటు తోలకాలకు సంబంధించిన అనుమతులు రద్దు చేస్తామని తెలిపారు. సాగునీటి చెరువుకు సంబంధించి ఆయకట్టు ఉన్న రైతులు వ్యవసాయ భూములు అభివృద్ధి చేయదలచుకుంటే ముందుగా ఇరిగేషన్ కార్యాలయానికి దరఖాస్తు సమర్పించాలని, అక్కడి నుంచి రెవెన్యూ శాఖచే ధ్రువీకరింపబడిన పత్రాలతో మట్టి తోలకాలకు అనుమతులు తీసుకొని పీడబ్ల్యూడీ డీఈకి అటు నుండి ఈఈ ద్వారా డీడీ కట్టించుకుని అనుమతులు పొందవచ్చు అన్నారు.

క్యూ కడుతున్న నాయకులు

సాగునీటి చెరువుల్లో మట్టితోలకాలకు జీఓ విడుదలయిందన్న విషయం తెలవగానే కొయ్యలగూడెం ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయం చుట్టూ కూటమి నేతలు క్యూ కడుతున్నారు. అనుమతుల కోసం ప్రజా ప్రతినిధుల ద్వారా పైరవీలు ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యవసాయ భూములు అభివృద్ధికి మాత్రమే మట్టిని వినియోగించాలని సూచిస్తున్నప్పటికీ కమర్షియల్ అవసరాలకు కూడా జేసీబీలు, ట్రక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. కొందరు అక్రమార్కులు తమకు అనుమతులు ఉన్నాయంటూ ఏకంగా రెండు రోజుల నుంచి చెరువులలో మట్టి తోలకాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా

పట్టించుకోని అధికారుల


రెడ్డిగణపవరం పుంత చెరువు సమీపంలో మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం పుంత చెరువు సమీపంలో యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారు. ఉదయం నుంచి జేసీబీతో మట్టిని తవ్వేస్తూ స్థావరాలు మార్చి మరీ ట్రాక్టర్లతో తరలించేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పేదల ఇళ్ల కోసం తవ్వుతున్నామంటూ పైకి చెబుతున్నా భారీగానే సొమ్ము వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు కొందరు మట్టి వ్యాపారులు. కొండలు, గుట్టలు, చెరువుల్లో మట్టిని అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇందతా కొందరు కూటమి నేతల అండదండలతో సాగుతుండడంతో అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మట్టి వ్యవహారాన్ని ఫోన్ చేసి చెప్పినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. అధికారులకు అన్నీ తెలిసే ఈ వ్యవహారం కొనసాగుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో రాత్రి, పగలు తేడా లేకుండా మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతునే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

టెండర్ ద్వారానే ఏజెన్సీలను ఎంపిక చేయాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో ఆటో రిక్షాలకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్ల తయారీ ఏజెన్సీలను టెండర్ విధానం ద్వారా ఎంపిక చేయాలని ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి జె.గోపి, సీఐటీయూ నాయకులు బి.త్రినాథ్ కోరారు. ఈ మేరకు ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఏలూరు నగర, పరిసర గ్రామాల నుంచి దాదాపు 5000 మంది ఆటో రిక్షా డ్రైవర్లు ప్రయాణికులకు సేవలందిస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గత మంగళవారం ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆటో రిక్షాలకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లను ప్రతి ఒక్కరూ విధిగా తీసుకోవాలని ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు వివరణాత్మకంగా తెలియజేయడాన్ని సీఐటీయూ స్వాగతిస్తుందని పేర్కొన్నారు. ఆటో రిక్షాలకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లు ఉండటం వల్ల ప్రయాణికుల భద్రత, నేరాల శాతాన్ని తగ్గించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. డిజిటల్ ట్రాఫిక్ నెంబర్ల తయారీదారులను టెండర్ విధానంలో ఎంపిక చేసి అధునాతన సాంకేతికత, తక్కువ ధరకు అందించేలా ఏజెన్సీలను ఎంపిక చేయాలని కోరారు. మంగళవారం జరిగిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ఏకపక్షంగా డిజిటల్ ట్రాఫిక్ నెంబర్ల ఏజెన్సీ వ్యక్తులను ఆటో డ్రైవర్లకు పరిచయం చేయడం సహేతుకమైన చర్య కాదని విజ్ఞప్తి చేశారు. ఆటో స్టాండ్‌లను అన్నిటినీ యూనియన్లుగా గుర్తించాలని కోరారు.

పీహెచ్‌సీలో ఖాళీ పోస్టుల భర్తీకి కృషి


పీహెచ్‌సీలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఓ

కొయ్యలగూడెం: పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న పోస్టులను ముగ్గురు వైద్యాధికారులతో భర్తీకి కృషి చేస్తామని డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ హెల్త్ సెంటర్స్ అధికారి డీసీహెచ్ఓ బి.సతీష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ప్రస్తుతం ఆరు పడకల వైద్య సేవలతో ఉన్న పీహెచ్‌సీని 30 పడకల హాస్పిటల్‌గా చేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. గైనిక్, చిన్నపిల్లల స్పెషలిస్ట్, అనస్థీషియా వైద్యుల పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని చెప్పారు. హాస్పటల్‌లోని పలు విభాగాలను పరిశీలించి వైద్యాధికారులకు సూచనలు చేశారు. దాదాపు పదేళ్ల నుంచి స్కానింగ్ సౌకర్యం లేకుండా పోయిందని, రోగులు సతీష్ దృష్టికి తీసుకొచ్చారు. హాస్పటల్‌లో నెలకొన్న అరకొర వసతులను వివరించారు. కాగా 1981వ సంవత్సరంలోనే పీహెచ్‌సీ అభివృద్ధిలో భాగంగా 60 పడకల హాస్పటల్ స్థాయికి చేర్చుతున్నట్టు జీఓ విడుదలైందని, కానీ అది ఆచరణకు నోచుకోలేదని సీనియర్ జర్నలిస్టు అన్నంరెడ్డి సుబ్బారావు, నాటి జీఓను సతీష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తామని సతీష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఎస్తేరు రాణి, తస్లీమాలకు హాస్పటల్లో ఓపీ శాతం పెంచాలని ఆదేశించారు.

ఉపాధి కల్పన ఎంపికలు


ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి కల్పన ఎంపికలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: సారా వ్యాపారాలు మానేసిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన అభ్యర్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ సింగ్‌మాట్లాడుతూ సారా వ్యాపారాలకు అలవాటు పడి, మానివేసిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓలు, డీఆర్‌డీఏ అధికారుల సమన్వయంతో ఉపాధి కల్పన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సారా మానికవేసిన వ్యక్తులకు ఉపాధి కల్పన ఎంపిక చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు, జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం డీఆర్‌డీఏ అధికారులు, స్టేషన్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు నగరం.. జలమయం

- ఏలూరులో చినుకు పడితే అవస్థలే!
- బుధవారం కురిసిన వర్షానికి పొంగి పొర్లిన డ్రెయిన్లు
- డ్రెయిన్లలో పిల్లు తీయకపోవడంతో ఇబ్బందులు
- ఇప్పుడే ఇలా ఉంటే వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని వాపోతున్న ప్రజలు


కలెక్టరేట్ ముఖద్వారం వద్ద నిలిచిన వర్షపు నీరు


ఏలూరులోని సెంట్ థెరిస్సా కాలేజీ వద్ద ఇలా..

ఏలూరు (టూటౌన్): చినుకు పడితే చాలు ఏలూరు నగరంలో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. కొద్దిపాటి వర్షానికే నగరంలోని అన్ని రహదారులు, కార్యాలయాలు, సెంటర్లు వర్షపు నీటితో నిండి పోయాయి. ప్రజలు కాలు కదిపేందుకు సైతం భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. బుధవారం ఉదయం ఏకబికిన గంట సేపు కురిసిన వర్షానికి డ్రెయిన్లలో నీరు పొంగి పొర్లింది. వ్యర్థాలన్నీ రోడ్లపైకి చేరి వాహనచోదకులు, బాటసారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వర్షం వెలిసిన తర్వాత కూడా వీధులన్నీ బురద నీటితో, వ్యర్థాలతో నిండి కన్పించాయి. దీనికి డ్రెయిన్ల నిర్వహణలో నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ నగర ప్రజలు విమర్శిస్తున్నారు. వేసవిలో వచ్చే వర్షం నీటికే ఇలా ఉంటే.. వర్షాకాలంలో వర్షాలకు నగరంలోని రోడ్ల పరిస్థితి ఏంటంటూ ప్రశ్న ప్రతి ఒక్కరిలోనూ తలెత్తుతుంది.

రోడ్లపై పారిన నీరు

అకస్మాత్తుగా కురిసిన వర్షానికి నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. మురుగు నీరు పొంగిపొర్లి రోడ్లపైకి చేరింది. బురద, వ్యర్థాలన్నీ రోడ్లపై దర్శనమిచ్చాయి. ఏలూరు 12 పంపుల సెంటర్, పవరుపేట సెంటర్, రైల్వే ట్రాక్ రోడ్డు, పవరుపేట రైల్వే గేటు సెంటర్, శ్రీనివాస థియేటర్ రోడ్డు, ఎన్ఆర్‌పేట ఇలా ప్రతి రోడ్డులోనూ వర్షం నీరు పొంగి పొర్లింది. వ్యర్థాలూ అదే స్థాయిలో రోడ్డుపైకొచ్చి చేరాయి.

ప్రభుత్వ కార్యాలయాల్లో చేరిన నీరు

వర్షం దెబ్బకు నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో మురుగు నీరు పెద్ద ఎత్తున చేరింది. వర్షం నీటితో స్నేహ వారధి పూర్తిగా మునిగిపోయింది. జిల్లా ప్రభుత్వాసుపత్రి, కలెక్టరేట్ ముఖ ద్వారం, సెయింట్ థెరిస్సా కాన్వెంట్ గ్రౌండ్, కొత్త బస్టాండ్ ప్రాంగణం, జిల్లా పరిషత్ ప్రాంగణం ఇలా ప్రతి కార్యాలయం ఆవరణలోనూ వర్షం నీరు పెద్ద ఎత్తున చేరింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ప్రజలు, ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు.

జన జీవనం అస్తవ్యస్తం

బుధవారం ఉదయం కురిసిన వర్షం కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా తయారైంది. అడుగు తీసి అడుగు బయట పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డుపైకి వచ్చిన వృద్ధులు, విద్యార్థులు, వాహనదారులు నానా అగచాట్లు పడ్డారు. చిరు వ్యాపారాలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రైల్వే ట్రాక్ రోడ్డు నిండా వర్షం నీరు ప్రవహించడంతో ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు చేసే మామిడి పండ్ల వ్యాపారులు, వాటిని సంరక్షించుకునేందుకు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తోపుడు బండ్లు, కూరగాయల వ్యాపారులదీ ఇదే పరిస్థితి. మొత్తంగా వర్షం సాధారణ జన జీవనాన్ని కొద్ది సేపు అతలాకుతలం చేసింది.

ఏలూరులో 16న బైక్ ర్యాలీ


నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): సార్వత్రిక సమ్మె విజయవంతం కోరుతూ ఈనెల 16న సాయంత్రం నాలుగున్నర గంటలకు ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు ఏఐటీయూసీ నాయకులు పి.కిషోర్‌లు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఆర్ఆర్‌పేట ఎస్ఆర్టూ వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

సమ్మెలో సంఘాలన్నీ పాల్గొనాలి


అభివాదం చేస్తున్న నాయుకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 20న నిర్వహించే కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెలో ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాలన్నీ పాల్గొనాలని ఏఐటీయూసీ సీనియర్ నాయకులు, ఏలూరు ఏరియా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు పిలుపు ఇచ్చారు. ఆయన అధ్యక్షతన స్థానిక స్ఫూర్తి భవనంలో ఏలూరు ఏరియా ఏఐటీయూసీ అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు, ఏలూరు పట్టణ జట్టు, లాగుడు బండ్ల కార్మిక సంఘం అధ్యక్షులు పుప్పాల కన్నబాబు, జిల్లా నాయకులు పి.కిషోర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్‌లు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి వేసిందని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరిస్తోందని విమర్శించారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలు యూనియన్ల నాయకులు డి.లక్షణామూర్తి, ఎస్ సురేష్ కుమార్, ఆది నరేష్, విజయ్, పి.హరీష్, చంద్రశేఖర్ (బుజ్జి), యలగాడ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొయ్యలగూడెం: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల నిమిత్తం దిప్పకాయలపాడు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని డీఈ పీర్ అహమ్మద్ తెలిపారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ నిలిపివేస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

టి.నరసాపురం: మండలంలోని బండివారిగూడెం ఫీడర్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం ఈ నెల 15 నుంచి 22 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతాయని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 8 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సీహెచ్‌సీలో తనిఖీ చేసిన ఎమ్మెల్యే

బుట్టాయగూడెం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల వివరాలు, మందులు, విధుల వివరాలపై ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలని ఎమ్మెల్యే సూచించారు.

నేటి నుంచి రిలే దీక్షలు

బుట్టాయగూడెం: షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని కోరుతూ నేటి నుంచి తహసీల్దార్ కార్యాలయం ఎదుట జేఏసీ ఆదివాసీ నాయకులు తెలిపారు. ఆ కమిటీ సమావేశం బుధవారం సింగన్నపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మడకం వెంకటేశ్వరరావు, మొడియం శ్రీనివాసరావు, మొడియం గంగరాజులు మాట్లాడుతూ వెంటనే ట్రైబల్ అడ్వైజర్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. రిలే నిరాహార దీక్షల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం

జంగారెడ్డిగూడెం: ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక అశ్వరావుపేట రోడ్డులో ఉన్న యూటీఎఫ్ కార్యాలయంలో పార్టీ శిక్షణా తరగతులు జిల్లా కమిటీ సభ్యుడు జి.వెంకట్రావు అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. నాయకులు అందుగుల ప్రభాకర్ రావు జీవరత్నం, పాండురంగారావు, యాగంటి సీత, జోడే సూర్యచంద్రరావు, బుద్దుల గంగాభవాని, ఎం బాలరాజు, ఎం అశోక్‌కుమార్, ఈ.నరసరావు, పి.దుర్గా తదితరులు పాల్గొన్నారు.

రోగ్యులకు సకాలంలో అందని వైద్యం

పోలవరం రూరల్: కూటమి ప్రభుత్వంలో సకాలంలో వైద్యశాలల్లో రోగులకు వైద్యం అందడం లేదని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి గిరిజనులు ఎంతో మంది వైద్యం కోసం వస్తుంటారని, వారి వైద్యం విషయంలో నిర్లక్ష్య వైఖరి కనబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కుంకాల గ్రామానికి చెందిన గర్భిణి తామా శిరీష మంగళవారం రాత్రి చికిత్స నిమిత్తం వైద్యశాలకు వస్తే వైద్యాధికారుల నిర్లక్ష్యం, సకాలంలో వైద్యం అందకపోవడంతో ఆమె మృతి చెందిందని తెలిపారు. ఆమె మృతికి బాధ్యులైన వైద్యధికారులను సస్పెండ్ చేయాలని, ఇకపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు సరైన వైద్యం అందకపోతే ఉద్యమానికైనా సిద్ధమని హెచ్చరించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు


వేసవి తరగతులకు హాజరైన విద్యార్థులు

లింగపాలెం: ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారిణి సీహెచ్‌వీ రమణ తెలిపారు. బుధవారం దశావతారాల్లో రెండోది కూర్మవతారం గురించి రమణ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో వారికి నచ్చిన పుస్తకాలు చదివించి, పుస్తక సమీక్ష చేయించారు. జనరల్ నాలెడ్జ్‌తో పాటు, చెస్, మైండ్ మెమరీ గేమ్స్ ఆడించారు. కార్యక్రమంలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.